


నేడు వైద్య, ఆరోగ్యశాఖ గ్రీవెన్స్‌డే

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే సిబ్బందికి మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే వారు ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలుంటే మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు తమ కార్యాలయంలో జరుగు గ్రీవెన్స్ హాజరై వినతిని అందజేయాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
323 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభ సమయం కాగా ఆయా కేంద్రాలకు విద్యార్థులు 8.30 గంటలకే చేరుకున్నారు. పిల్లలు మొదటిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తుండడంతో విద్యార్థుల వెంట తల్లి తండ్రులు, పాఠశాలల ఉపాధ్యాయులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. 9 గంటల్లోపు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లో లోపలికి అనుమతి ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా రూములో విద్యార్థిని కూర్చోబెట్టి శుభాకాంక్షలు చెప్పి వచ్చారు. 9 గంటలు తర్వాత తల్లిదండ్రులను లోపలికి అనుమతించలేదు. ప్రతి విద్యార్థిని తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అధికారులు అనుమతిస్తున్నారు. విద్యార్థులు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ పరీక్షలు రాసేందుకు కేంద్రం లోపలికి వెళ్లారు. ఆటోలు, బైక్‌లు, ప్రైవేట్ పాఠశాలల వారి బస్సుల్లో విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పరీక్షకు 10,746మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 323మంది గైర్హాజరయ్యారు.

పరీక్షా కేంద్రం తహాశీల్దార్ పరిశీలన

మండలంలోని డోకిశీల, పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను స్థానిక తహాశీల్దార్ ఆనందరావు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల ఏర్పాటు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేసిన శిబిరం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకష్ణ, రూరల్ ఎస్ ఐ దినకర్ పాల్గొన్నారు.



కురుపాం : పరీక్షా గదిని చూసుకుంటున్న విద్యార్థులు



వీరఘట్టం : తండ్రి సాయంతో పరీక్షా కేంద్రాన్ని ట్రైకిల్‌పై పరీక్షకు హాజరైన గణేష్

కొమరాడ : మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో గల మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో 8రూముల్లో 170 మంది విద్యార్థులు, గిరిజన గురుకులంలో పది రూముల్లో 190 మంది విద్యార్థులు, కొమరాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరు రూములో 137 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు తెలుగు పరీక్ష ప్రారంభమైంది. మొదటి రోజు పరీక్ష కావడంతో విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని విధాలా చర్యలు చేపట్టినట్లు ఎంఇఒ జె.నారాయణస్వామి తెలిపారు. అత్యవసర సేవల నిమిత్తం పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ప్రధాన రహదారిపై ఆర్టీసీ అధికారులు ఎగ్జామ్ కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బస్సు సౌకర్యం లేని విద్యార్థులు ఆటోలపై పరీక్ష కేంద్రానికి వచ్చారు. ఆటో సదుపాయాల్లేని విద్యార్థులు తమ తల్లిదండ్రులతో సొంత వాహనాలపై కలిసి కేంద్రానికి వచ్చారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సీతానగరం : మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సీతానగరం, బూర్జ, జోగింపేట గురుకుల పాఠశాలల పరీక్షా కేంద్రాల్లో 581 మంది విద్యార్థులకు 33మంది గైర్హాజరైనట్టు ఎంఇఒ సూరిదేముడు తెలిపారు.

కురుపాం : మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఆదర్శ పాఠశాలలో 240 మందికి 240 మంది విద్యార్థులు హాజరు కాగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 132 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరవ్వగా, ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 286 మంది విద్యార్థులకు ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. అలాగే ఆదర్శ పాఠశాల వద్ద మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 142 మందికి 127 మంది హాజరవ్వగా 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ విధించారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 754 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ వీరఘట్టం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 141మంది విద్యార్థులకు గానూ 9 మంది విద్యార్థులు హాజరు కాలేదు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు గాను ఆరుగురు పరీక్షకు హాజరు కాలేదు. గంగాడ గణేష శైల గ్రీష్మ , మరో దివ్యాంగురాలు స్క్రైబర్ సహాయంతో పరీక్ష రాశారు.

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తహాశీల్దార్ కె.జయప్రకాశ్ సోమవారం పరిశీలించారు. ప్రతి రూముకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి అందుబాటులో మంచినీరు, మందులు ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు.



పార్వతీపురం: సిబ్బందికి సూచనలు చేస్తున్న తహాశీల్దార్ ఆనందరావు



టెన్త్ హాల్ టిక్కెట్టు చూపుతున్న విద్యార్థి రాజ్‌కుమార్

అధికారుల నిర్లక్ష్యం... విద్యార్థికి శాపం

మూడు నెలలుగా మంచం పైనే ఉన్నా పట్టించుకోని దుస్థితి
అయినా టెన్త్ పరీక్షకు హాజరైన గిరిజన విద్యార్థి
లాంగ్ ఆబ్సెంట్ అని చెబుతున్న అధికారులు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆ విద్యార్థి భవిష్యత్తు ఏమిటో కూడా తెలియని పరిస్థితిలో ఉన్న అధికారులు తీరు చూస్తే వారి విధుల నిర్వహణ ఏ మేరకు జరుగుతుందో ఇట్టే అర్థమవుతుంది. విద్యార్థి కాలుకు తీవ్ర గాయమై మూడు నెలలు కావస్తున్నా ఒకే ఒక్కసారి పాఠశాలకు చెందిన డిప్యూటీ వార్డెన్ వెళ్లి కేవలం వెయ్యి రూపాయలు తల్లిదండ్రుల చేతిలో పెట్టి అక్కడితో తమ పని అయిపోయిందని చేతులు దులిపేసుకున్నారు. ఆఖరుకు ఆ విద్యార్థి టెన్త్ పరీక్షకు హాజరయ్యాడా, లేదానన్న విషయం కూడా తెలుసుకోని దుస్థితిలో అధికారులు ఉన్నారంటే గిరిజన విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఇట్టే అర్థమైపోతుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బిడ్డిక రాజ్‌కుమార్ జనవరిలో ప్రమాదవశాత్తు జారిపడి కుడికాలుకు తీవ్ర గాయమైంది. అయితే విద్యార్థికి వైద్యం అందాల్సిన వార్డెన్, పాఠశాల హెచ్ఎం నిర్లక్ష్య ధోరణి కారణంగా తల్లిదండ్రులే స్వయంగా ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే విద్యార్థికి కాలు తొలగిస్తామని వైద్యులు సూచించడంతో భయపడిన తల్లిదండ్రులు రాజ్‌కుమార్‌ను ఇంటికి తీసుకొచ్చి నాటు వైద్యం చేయించారు. గత మూడు నెలలుగా విద్యార్థి మంచంపైనే ఉంటున్నాడు. సోమవారం నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. ఇదే విషయం సంబంధిత హెచ్ఎం, ఎటిడబ్ల్యూఒల వద్ద ప్రస్తావించగా విద్యార్థి లాంగ్ ఆబ్సెంట్ కారణంగా పరీక్షలకు హాజరు కాలేదని సమాధానం ఇవ్వడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. విషయమేమిటంటే విద్యార్థి సోమవారం నిర్వహించిన పరీక్షలకు హాజరై పరీక్ష రాసి ఇంటికి తిరిగి వచ్చారు. ఏదేమైనప్పటికీ ఒక గిరిజన విద్యార్థి అనారోగ్యం బారినపడితే పాఠశాల సిబ్బంది ఏం మాత్రం పట్టించకపోవడంతో తల్లిదండ్రుల్లో ఆవేదన కనిపిస్తోంది. రాజ్‌కుమార్‌కు పరీక్ష రాయాలనే తపన ఉండడంతో సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు ముగ్గురు వ్యక్తుల సాయంతో హాజరు కావడం అందర్నీ ఆశ్చర్యాన్ని గురిచేసింది. ఒక విద్యార్థి విద్యార్థి పరీక్ష రాశాడా లేదా కూడా తెలుసుకోవాలన్న స్థితిలో మన అధికారుల ఉన్నారంటే వాళ్ళ ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారు ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ, డిడి స్థాయి అధికారులు దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి తమ బిడ్డకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఇంటి వెనుక ఆధారాలు సేకరిస్తున్న విశాఖ సిపి రవిశంకర్

చెడ్డీగ్యాంగ్ హల్‌చల్

- సత్యనారాయణపురంలో దొంగతనానికి యత్నం
- అడ్డుకున్న వ్యక్తిపై రాడ్లతో దాడి.. పరిస్థితి విషమం
- క్లూస్ టీమ్, పోలీస్ డాగ్‌తో ఆధారాల సేకరణ

మండలంలోని చింతలవలస ఐదో బెటాలియన్ మెయిన్ గేట్‌కి ఎదురుగా ఉన్న సత్యనారాయణపురంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఒక ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను భయబ్రాంతులకు గురిచేసింది. రూమ్‌లో నిద్రిస్తున్న భార్యాభర్తలను భయపెట్టి వారి వద్ద ఉన్న నగలను దోచుకోవడానికి ప్రయత్నించింది. ఈ సమయంలో వారు కేకలు వేయడంతో భర్తను రాడ్లతో కొట్టి పరారయ్యారు. చెడ్డీగ్యాంగ్ ఘటనతో జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..

ప్రజాశక్తి - డెంకాడ

సత్యనారాయణపురానికి చెందిన యారపాటి రమణమూర్తి కుమారుడు లక్ష్మీభరద్వాజ్ కోడలు ఒక గదిలో నిద్రిస్తుండగా, మరో గదిలో ఇంటి యజమాని రమణమూర్తి, తన భార్య నిద్రిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో వీరి ఇంట్లో నలుగురి గ్యాంగ్ చొరబడింది. ఇద్దరు బయట ఉండగా, మరో ఇద్దరు ప్రధాన ద్వారానికి మిషన్‌తో రంధ్రం పెట్టి లోపలి గడియను తొలగించారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి భరద్వాజ్ దంపతులు నిద్రిస్తున్న రూమ్‌లోకి వెళ్లారు. అలజడి కావడంతో కోడలికి మెలకువ వచ్చింది. వెంటనే పక్కనే ఉన్న భర్తకు చెప్పింది. భర్త నిద్ర లేచి దొంగలను చేసి కేకలు వేయడంతో వారి వద్ద ఉన్న రాడ్లతో భరద్వాజ్ తలపై తీవ్రంగా కొట్టారు. ఇంతలో ఎదురుగదిలో నిద్రిస్తున్న తండ్రి రమణమూర్తి, తల్లి లేచి కరెంటు సమస్యో ఏమో అనుకుని మీటర్ స్విచ్ ఆఫ్ చేశారు. ఈ చీకట్లో దొంగలు బయటకు వెళ్లిపోయి, మళ్లీ లోపలికి వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు నలుగురూ కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే వస్తువులేవీ చోరీకి గురికాలేదు.

అంతా ప్లాన్ ప్రకారమే..

ముందుగా గ్యాంగ్ ప్లాన్ ప్రకారం ఇంటికి రావడానికి ఇనుప కంచె కట్టర్‌తో కట్ చేసి ముందుగా తోవ ఏర్పాటు చేసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి ఇంటి తలుపులకు ముందుగానే దొంగలు బయట గడియలు పెట్టేశారు. అనంతరం ఇంట్లోకి దొంగతనానికి ప్రవేశించి అడ్డు వచ్చిన భరద్వాజ్‌పై దాడి చేశారు. గాయాలపాలైన భరద్వాజ్ స్పృహ కోల్పోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఇలాంటి దొంగతనం ఈ ప్రాంతంలో తొలిసారి జరగడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

సిపి రవిశంకర్ పరిశీలన

ఈ గ్రామం పద్మనాభం మండలం, విశాఖపట్నం అర్బన్‌లో ఉంది. దీంతో సంఘటనా స్థలాన్ని విశాఖపట్నం సిపి రవిశంకర్, జాయింట్ కమిషనర్ పకీరప్ప, డిసిపి-1 విజయ మణికంఠ, క్రైమ్ డిసిపి వెంకటరత్నం.. సోమవారం ఉదయం పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి ఆధారాలను సేకరించింది. దొంగతనం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఆరు బృందాలు ఏర్పాటు

దొంగలను పట్టుకునేందుకు ఆరుగురు సిఐల ఆధ్వర్యంలో ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో రామభద్రపురంలో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం... తాజాగా సత్యనారాయణపురం ఘటన ఒకే మాదిరిగా ఉన్నాయని, ఈ రెండు చోరీలకు ప్రయత్నించిన వారు ఒకే గ్యాంగ్ అని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇది చెడ్డీగ్యాంగ్ పనేనని పోలీసులు తెలిపారు.

ఎన్నికల కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను కలెక్టరు నిశాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు, యంత్రాంగం ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూం పనితీరును పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంనకు వచ్చే ఫిర్యాదులపై తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో ఎంసిసి బృందాలు, వ్యయ ఖర్చులు, ప్రకటనలు, ప్రచారాలు, కార్యక్రమాలు ఇతర అంశాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టి, వీఎస్టీ, వీవీటీ, ఎస్ఎస్‌టి బృందాలు తమ నివేదికను ఎన్నికల కమిషను నిర్దేశించిన సమయంలోగా పంపించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రచారం, నామినేషన్, ఇతర అంశాలకు సంబంధించిన అనుమతులు సింగిల్ విండో విధానం సువిధలో సకాలంలో అందించాలని తెలిపారు.నివేదికల సమర్పణలో ఎటువంటి జాప్యం ఉండరాదని అన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ రూం ఇన్ ఛార్జ్, జాయింటు కలెక్టరు ఎస్ఎస్ శోబిక, ఇంచార్జి డిఆర్ఒ జి.కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి సూర్యనారాయణ, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారిలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌తో కలిసి కవాతు నిర్వహించారు.



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

బిజెపికి వంత పాడే పార్టీలకు బుద్ధిచెప్పాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం

ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి సాధించుకున్న 1/ 70, పీసా, అటవీ హక్కుల చట్టాలను నిర్వీర్యం చేస్తూ గిరిజన హక్కులను కాలరాస్తున్న బిజెపి, జనసేన, టిడిపి, వైసిపిలను ఎండగట్టి రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డమానుగూడలో సిపిఎం మండల నాయకులు వి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం విస్తృత స్థాయి సమావేశానికి కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, దళితులు, రైతులు పేదల కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను పార్లమెంటుకు, అసెంబ్లీకి పంపించాలని, గిరిజనుల పేరుతో ఓట్లు గుంజుకుని అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు ఎంతవరకు గిరిజనులకు న్యాయం చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా గిరిజనులు కళ్లు తెరిచి కోరన్న, మంగన్న, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోరాటాలు చేసి ప్రాణాలు సైతం అర్పించి సాధించి పెట్టిన హక్కులు అందక నేటికీ గిరిజనులు దుర్భరంగా బతుకుతున్నారని అన్నారు. గిరిజనులకు సాగునీరు కల్పించకపోవడంతో పనుల కోసం వలసలు పోతున్న దుస్థితి ఏర్పడిందని అన్నారు. గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తూ గిరిజనులకు ద్రోహం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గిరిజనులపై అత్యంత కిరాతకంగా దాడులు జరిపిన మణిపూర్ ఘటన ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన బిజెపి ప్రభుత్వానికి వంతపాడుతున్న టిడిపి, జనసేన, వైసిపిలపై గిరిజనులంతా వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రమణ, కోరాడ ఈశ్వరరావు, అడ్డమేశ్వరరావు, గవర వెంకటరమణ, అనిల్ కుమార్, ఇండియా తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గిరిజనుల పక్షాన అన్ని వేళలా పోరాడే వామపక్ష అభ్యర్థిని గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర పిలుపునిచ్చారు. మండలంలోని కల్లికోట జోన్ పరిధిలో గ్రామాల కార్యకర్తలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల నుంచి గిరిజనులు, రైతులు దళితులు, వృత్తిదారులు పక్షాన అనేక ప్రజల హక్కుల రక్షణ కోసం ఎర్ర జెండా నాయకత్వంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన వామపక్షాల తరఫున ఎవరైతే పోటీ చేస్తారో వారిని అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ఎన్నికల బండ్లు పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన జీవో 3ను రద్దుచేసి అటవీ హక్కు, ఉపాధి హామీ చట్టాలను నిర్వీర్యం చేసి, కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజలపై భారాలు వేస్తున్న బిజెపిని, మన రాష్ట్రంలో బిజెపికి బలపరుస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీసభ్యులు కె.సాంబమూర్తి ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో గ్రామనాయకులు త్రినాథ, లక్ష్మణరావు, శంకర్రావ, పలువురుగ్రామస్తులు పాల్గొన్నారు.



కురుపాం : బొడ్డమానుగూడలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



సీతంపేట : జక్కరవలసలో పర్యటిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ప్రజాశక్తి - సీతంపేట

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. సోమవారం సీతంపేట మండలంలోని జక్కరవలస, మండ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ అమలును పరిశీలించారు. ఇంకా ఎక్కడైనా రాజకీయ నాయకుల పోస్టర్లు, విగ్రహాలుంటే వెంటనే తొలగించాలని సూచించారు. రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న శిలాఫలకాలను కూడా మూసివేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఆర్ఒ వివి రమణ అధికారులకు సూచించారు. సోమవారం కురుపాంలో ప్రధాన రహదారికి ఇరువైపులు ఉన్న ప్రధాన కేంద్రాల వద్ద షాపుల వద్ద ఎన్నికల కోడ్ అమలు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ ఇంకా ఎక్కడైనా రాజకీయ నాయకులు, పోస్టర్లు వెంటనే తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న శిలా ఫలకాలను కూడా మూసివేయాలని తెలిపారు. కార్యక్రమం లో తహాశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, కరుణాకర్, ఇఒకె.చంద్రశేఖర్, తదితరలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బలిజిపేటలో దాహం కేకలు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట

'ఆర్భాటంగా చెప్పేదేమో కొండంత... చేసేది గోరంత... అన్న చందంగా ఉంది కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పథకం తీరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో గ్రామాల్లో ఇంటింటా కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ మంచినీరందించాలని, ఈ పథకం అమల్లోకి తెచ్చారు. అయితే ఈ పథకం అమల్లో మన రాష్ట్రం మొదటి ర్యాంకులో ఉందని గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో దీని వైఫల్యాలు అన్నీ ఇన్ని కాదు. ఇందుకు నిదర్శన బలిజిపేట.

బలిజిపేటలో జలజీవన్ మిషన్ పథకాన్ని అధికారులు ఏమాత్రం ఆలోచన చేయకుండా ఏర్పాటు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి ఎంత నీరు అవసరం, ఎన్ని ట్యాంకులు ఏర్పాటు చేయాలి, ఎన్ని కనెక్షన్లు ఇవ్వాలన్న ఆలోచనలు లేకుండా ఇష్టాను సారంగా సిసి రోడ్లకు ఇరువైపులా తవ్వి అధికారులు కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే ఇంతవరకూ చుక్కనీరు కూడా ఈ పథకం ద్వారా గ్రామస్తులకు చుక్క నీరు అందని పరిస్థితి. బలిజిపేటలోని పలగరలో గుడివాడ కాలనీ, బలిజిపేట దళితపేటకు రెండు నెలలు నుండి గుక్కెడు మంచినీళ్ల కోసం ప్రజలు అల్లాడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన లేదు. ఈ సందర్భంగా ఆయా వీధుల మహిళలు మాట్లాడుతూ రెండు నెలలు నుంచి తాగడానికి నీరు లేక అల్లాడిపోతున్నామని, కనీసం అధికారులు గానీ,


పలగరలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పంచాయతీ కార్యదర్శి గానీ పట్టించుకోలేడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడే నీరు లేకపోతే రానున్న వేసవిలో మరింత ఇబ్బందులు తప్పవని ఈ సందర్భంగా వారి తమ గోడును సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు వద్ద వెల్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఎంతో ఆర్భాటంగా ఇంటింటి కొళాయిలు వేశారని, నిరంతరం తాగడానికి నీళ్లు వస్తాయని ప్రజల ఆశపడ్డారు కానీ, వేసిన కుళాయిలు ఉత్సవిగ్రహంలో ఉన్నాయి తప్ప ఉపయోగం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బలిజిపేట మండల కేంద్రంలో ఎప్పుడూ తాగునీటి సమస్య ఉందని, ఈ సమస్య ప్రతి ఏటా వెంటాడుతుందని అన్నారు. ఈ సమస్యను అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని, శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు, నాయకులు ఇలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. మంచినీటి సమస్య వల్ల మండలంలో అనేక గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాగడానికి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పోలింగ్ కేంద్రాలను, సచివాలయాలను ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ సోమవారం పరిశీలించారు. కరివలస, గైరమ్మపేటలో గల 102, 103, 104 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అంతకుముందు పద్మాపురం, పాచిపెంట-1 సచివాలయాలను పరిశీలించి, దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దస్త్రాలు నిర్వహణ బాగోలేకపోతే చర్యలు బాధ్యులవుతారని హెచ్చరించారు. అలాగే ఎన్నికల నియమావళి ఉన్న సందర్భంగా రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు, కటౌట్లు తొలగించాలని ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట తహశీల్దార్ పి.బాల, డిటి ఎం.రాజశేఖర్, ఆర్ఐ రమణారావు పాల్గొన్నారు.


పార్టీ శ్రేణులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న రాజన్నదొర

వైసిపి శ్రేణుల్లో జోష్

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఐదోసారి రాజన్నదొర ఎంపిక కావడంపై నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఎంపి అభ్యర్థిగా ఎంపిక చేయనందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మెంటాడ మండలం కుంటినవలసకు చెందిన నాయకులు, కార్యకర్తలు రాజన్నదొరను ఆయన నివాసంలో కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. మండల మహిళా నాయకులు పెద్దిరెడ్ల అరుణాదేవి ఆధ్వర్యాన యువకులు రాజన్నదొరను కలిశారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా స్వీట్లు పంచిపెట్టారు. రాజన్నదొరను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని సీనియర్ నాయకులు మయూరి అప్పలనాయుడు, అరుణాదేవి చెప్పారు.


ఎమ్మెల్యే జోగారావును కలిసిన ముస్లిములు

ఎమ్మెల్యేను కలిసిన ముస్లిములు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ పెద్దలు, నాయకులు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుని సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మళ్లీ ఎమ్మెల్యే టికెట్ వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు.


గోచెక్కలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని లిడికివలస, గోచెక్కలో మండల టిడిపి అధ్యక్షుడు, కార్యదర్శులు బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలాపు రామారావు, రాము, సాంబమూర్తి మొదలగు వారు పాల్గొన్నారు.

వెల్నెస్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వెంకటాపురం, మరిపివలస, సూరంపేట గ్రామాల్లో హెల్త్‌వెల్నెస్, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్నెస్ కేంద్రాల్లో రికార్డులు పరిశీలించి ప్రతి రోజూ నమోదవుతున్న ఒపి వివరాలు, వారికి నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, మందులు, చికిత్స తదితర వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వర నిర్ధారణ పరీక్షలు లభ్యతను పరిశీలించారు. గ్రామాల్లో డ్రైడే అందరూ పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ, ఆ పరిధిలో ఉండే ప్రజలు వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు వినియోగించుకునేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, రికార్డులు తనిఖీ చేసి, ఆ నివేదికలు అనుగుణంగా పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. పౌష్టికాహారం, ఎదుగుదల లోపం, రక్త హీనతగా గుర్తించిన పిల్లల ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. వారానికి రెండు సార్లు ఐరన్, సిరప్ విధిగా వేయించాలన్నారు. పిల్లలు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా తరచూగా మంచినీరు తాగించాలన్నారు. జ్వర లక్షణాలు గుర్తిస్తే సత్వరమే చికిత్స అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయలక్ష్మి, శ్రావణి, అంగన్వాడీ సిబ్బంది సంగమ్మ, శ్రీదేవి, మంజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బొబ్బిలి యుద్ధస్తంభాన్ని సందర్శిస్తున్న విద్యార్థులు

చారిత్రాత్మక ప్రదేశాల సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు హిస్టారికల్ టూర్‌లో భాగంగా బొబ్బిలిలో గెస్ట్ హౌస్, బొబ్బిలికోట, కోటలో ఉండే మ్యూజియం, యుద్ధ సూచకైన గంట స్తంభాన్ని సందర్శించారు. ఈ పర్యటనకు ఆర్‌టిసి బస్సును ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఏర్పాటు చేసి విద్యార్థులకు చారిత్రిక ప్రదేశాలను చూపించారు. కళాశాల హిస్టరీ విభాగం అధ్యాపకులు ఎ.శ్రీవాణి, ఎకనామిక్స్ లెక్చరర్ స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.త్రినాధ పాల్గొన్నారు.


డిఎస్ఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ఆఫ్‌లైన్‌లోనే గిరిజనులకు సరుకులివ్వాలి

డిఎస్ఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - బెలగాం

కొమరాడ మండలం కుంతేసు, పూడేసు, మసిమండ, పెదశాఖ పంచాయతీల్లో గల గిరిజన గ్రామాల ప్రజలకు ఆఫ్‌లైన్‌లో నిత్యవసర సరుకులు అందజేయాలని సిపిఎం నాయకులు జిల్లా పౌరసరఫరా అధికాకి ఆర్.శివప్రసాద్‌కు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.సాంబమూర్తి, గిరిజనులు చిరంజీవు, కె.సోమేశ్వరరావు, సామల దేవరాజ్ మాట్లాడుతూ మండలంలోనికుంతేసు, పూడేసు, మసిమండ, పెదశాఖ పంచాయతీలకు సంబంధించి పలు గ్రామాలకు నిత్యవసర వస్తువులు సరఫరా చేసే సందర్భంలో నెట్ పనిచేయకపోవడం వల్ల పలు గిరిజన గ్రామాలకు నిత్యవసర వస్తువులు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఎప్పటికప్పుడు సిగ్నిల్స్ మొరాయించడంతో బయోమెట్రిక్ కాక సరుకులు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున నిత్యవసర వస్తువులు అందజేసి గిరిజనులు ఆదుకోవాలని కోరారు. దీనికి డిఎస్ఒ స్పందించి ఈ సమస్య కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సంక్షేమ వసతి గృహాల బకాయిలు తక్షణమే చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల సంక్షేమ వసతి గృహాల బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ఐటిడిఎలకు డిసెంబర్ వరకు బకాయిలు చెల్లించినప్పటికీ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఐదు నెలల బకాయిలు ఉండడంతో ఆశ్రమ పాఠశాలలకు సక్రమంగా నిత్యవసర వస్తువులు సరఫరా చేయడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని అన్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత సంక్షేమ వసతి గృహాలను, పాఠశాలలను అధికారులు ప్రతిరోజూ పోటీపడి పర్యవేక్షిన్నారే తప్ప పెండింగ్ బిల్లుల మంజూరుపై ఎందుకు దృష్టిపెట్టారని ప్రశ్నించారు. నిధులు చెల్లించకపోవడంతో ఆయా హాస్టళ్ల వార్డెన్లు అనేక అవస్థలుపడి అప్పులు చేసి ఎన్ని రోజులు విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే ఆయా ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లకు సంబంధించి ఐదు, ఆరు నెలల బిల్లులు పెండింగ్ ఉంటే వార్డెన్లు ఎక్కడ అప్పులు తెచ్చి పిల్లలకు ఆహారం అందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు రావాల్సిన అన్ని వస్తువులతో పాటు బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.

వేలం పాట వాయిదా

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో షాపులకు సంబంధించి ఈనెల 20న జరగాల్సిన వేలంపాట అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి పి.రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి తేదీని వేలందారులకు తెలియజేస్తామని, ఈ అంశాన్ని గ్రహించాలని ఆయన కోరారు.


వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆరోగ్య కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా మార్గ నిర్దేశం చేసి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైద్య, ఆరోగ్య కార్యాలయంలో సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి)లకు కేర్ కంపానియన్ ప్రోగ్రాం (సిసిపి)పై సోమవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ శిక్షణను డాక్టర్ వి.కమల్‌నాథ్, సిసిపి టెక్నికల్ కన్సల్టెంట్ ఎం.మణి పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యాచ్‌ల వారీగా ఈనెల 26 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ సిహెచ్‌ఒలు శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు గాను సిహెచ్‌ఒలు, వారి పరిధిలో ఉండే గ్రామస్తుల ఆరోగ్యానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, దీర్ఘ కాలిక రోగులు, పిల్లలు, కిశోరబాలికల ఆరోగ్య నివేదికలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హైరిస్క్ సమస్యలను గుర్తించి వాటిని నివారించే కార్యాచరణ చేపట్టాలన్నారు. పలు ఆరోగ్య సమస్యలు, వాటి లక్షణాలు, నివారణ చర్యలను సులభంగా తెలుసుకొనేలా చిత్రాలతో సూచించిన ఫ్లిప్‌చార్ట్ ల ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించి


శిక్షణలో మాట్లాడుతున్న డిఎంఒ జగన్మోహనరావు

అవగాహన కల్పించాలని సూచించారు. దీనివల్ల ప్రజలు వారి ఆరోగ్య స్థితిని స్వయంగా పున్నపరిశీలించుకునేందుకు దోహదపడుతుందన్నారు. చికిత్స తర్వాత ఆసుపత్రుల నుండి డిశ్చార్జి అయిన రోగులకు క్షేత్ర స్థాయిలో ఆరోగ్య పరిశీలన చేస్తూ, త్వరగా కోలుకొని ఆరోగ్యకరమైన స్థితి పొందేలా చూడాలన్నారు. రక్తహీనత నివారణ, పౌష్టికాహారం, గర్భిణీలు, శిశువుల్లో హైరిస్క్ సమస్యలు గుర్తించడం, శిశువుకు తల్లిపాలు ఇచ్చే పద్ధతులు, ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించడం, దీర్ఘకాలిక రోగాలైన బిపి, షుగర్, గుండె, శ్వాస సమస్యలు, క్యాన్సర్ మొదలగు వారి ఆరోగ్య పర్యవేక్షణ, బాల్య వివాహాలు వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక దుష్ప్రభావాలు ప్రజలకు వివరించాలన్నారు. అలాగే కిశోర బాలికల్లో రక్త హీనత నివారణ, స్త్రీ, పురుష లింగ నిష్పత్తి సమానత్వం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సాధారణంగా ప్రబలే పలు వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, అప్రమత్తం చేయడం మొదలగు అంశాలపై దృష్టి సారించి ప్రజల ఆరోగ్యవృద్ధికి కృషి చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు దోహద పడుతుందని అన్నారు. శిక్షణలో పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు చెందిన హెల్త్ వెల్నెస్ కేంద్రాల సిహెచ్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి.. ప్రస్తుతం జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిన అసెంబ్లీ నియోజకవర్గమిది. టిడిపి, వైసిపి శ్రేణుల్లోనైతే హాట్‌టాపిక్‌గా మారింది. అందుకు కారణం లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో వైసిపి నుంచి ఎమ్మెల్యే బరిలో మంత్రి బొత్స సత్యనారాయణ దిగడం ఖాయమైంది. అటు టిడిపి నుంచి 'బలమైన అభ్యర్థి' అంటూ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును పోటీకి సిద్ధం చేస్తున్నారనే ప్రచారం రాష్ట్ర వ్యాప్తంగా చక్కర్లు కొడుతోంది. గంటా కూడా ఎక్కడా సీటు దొరక్కపోతే ఇక్కడి నుంచి పోటీకి సిద్ధమవుతున్నారనే చర్చ ఊపందుకొంది. అందుకు తగ్గట్టు ప్లాన్-బి వ్యూహాన్ని కూడా గంటా శ్రీనివాసరావు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

ఎక్కడా లేకుంటే ఇక్కడే?

వ్యూహానికి పదును పెడుతున్న గంటా

అంతర్గత సర్వేలో చీపురుపల్లిలో పోటాపోటీ

సానుకూల అంశాలపై ఆరా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిన టిడిపి, జనసేన కూటమి.. చీపురుపల్లి, శృంగవరపుకోటలో మాత్రం ఇంకా ఎటూ తేల్చుకోలేకపోతోంది. శృంగవరపుకోటలో పరిస్థితి వేరు. కానీ చీపురుపల్లిలో మాజీమంత్రి గంటా శ్రీనివాసరావును బరిలో దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగింది. భీమిలి లేదా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏదో ఒక నియోజకవర్గంలో అవకాశం దక్కకపోతే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చీపురుపల్లి నుంచే అనివార్యంగా పోటీచేయనున్నట్లు తెలిసింది. అందుకనుగుణంగా ప్లాన్ -బి వ్యూహాన్ని కూడా గంటా ఇప్పటికే రచించారట. చీపురుపల్లిలో గంటానే తగిన అభ్యర్థి అంటూ అంచనా వేయడాన్ని బట్టి మంత్రి బొత్స సత్యనారాయణ చాలా బలమైన అభ్యర్థి అనేది టిడిపి పరోక్షంగా అంగీకరించినట్టే లెక్క. ఇటువంటి స్థానంలో గంటా మాత్రం ఎందుకంత ఈజీగా వచ్చేస్తారన్నది రాజకీయ నాయకుల విశ్లేషణ. అందుకు తగ్గట్టే ఆయన కూడా భీమిలి నియోజకవర్గంలో పోటీకి ఉత్సాహం చూపుతున్నారట. అక్కడ కాకపోతే చోడవరం, లేదా ఇంకో స్థానం అంటూ పార్టీ అధినేతకు ఆప్షన్ కూడా చూపిస్తున్నట్టుగా టిడిపి సీనియర్లలో చర్చ నడుస్తోంది. ఇంతవరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రమే పోటీచేశానని, చీపురుపల్లిలో అయితే నాన్ లోకల్ సమస్య, సామాజిక పరంగా ప్రతికూల వాతావరణం ఉంటుందని అధిష్టానం ఎదుట చెప్తున్నారట. వాస్తవానికి గంటా ఇంత వరకు తాను కోరుకున్న స్థానం తొలి జాబితాలోనే వచ్చేసేది. మారిన రాజకీయ పరిస్థితుల రీత్యా ఎంతటివారైనా కోరుకున్న చోట కాకుండా, అధిష్టానం ఆదేశించిన చోట నుంచే బరిలో దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకు గంటా కూడా మినహాయింపు కాకపోవడంతో చివరి వరకు ప్రయత్నించి, ఫలించకపోతే అధిష్టానం చెప్పిన విధంగా చీపురుపల్లి వైపు దారి చూసుకునే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓడినా, గెలిచినా... అధికారంలోకి వచ్చినా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీలో గానీ, ప్రభుత్వంలో గానీ తన స్థానాన్ని ఎప్పటి మాదిరిగా పదిలం చేసుకునేందుకే గంటా శ్రీనివాసరావు తుదిపోరాటం సాగుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీన్ని బట్టి బహుసా ఎమ్మెల్యేగా ఓడినా ప్రభుత్వం ఏర్పడితే మంత్రి వర్గంలో స్థానం ఉండే విధంగా హామీ పొందేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా అర్థమౌతోంది. చీపురుపల్లి నుంచి పోటీచేయడం అనివార్యమైతే ఆలస్యంగా పనిలో దిగామనే పరిస్థితి లేకుండా గంటా తన సొంత మనుషులతో అంతర్గత సర్వేలు చేసుకుంటున్నట్టు సమాచారం. బొత్సతో ఢీకొంటే గట్టి పోటీ ఉంటుందని, పరిస్థితులను అనుకూలంగా మలుచుకోగలిగితే సానుకూలంగా ఉంటాయని ఆయన సొంత సర్వే రిపోర్టుల్లో వచ్చిందట. అందుకే చివరి క్షణాల్లో అనివార్యంగా వెళ్లాల్సి వస్తే అప్పటికప్పుడు ఇబ్బంది పడకుండా గంటా చాపకింద నీరులా తన వ్యూహానికి పదును పెట్టినట్టుగా తెలుస్తోంది.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ, కృష్ణరాయపురం, సీతానగరం సచివాలయాలను ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు సోమవారం సందర్శించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి స్టిక్కరింగ్ గోడ పత్రికలను తీయిచారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సిర్లి ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో సిర్లి ఎల్లమ్మ తల్లి జాతరను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గౌడువీధి సమీపంలో ఉన్న సిర్లి ఆలయంలో ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

300 లీటర్ల సారా స్వాధీనం

పాచిపెంట: గ్రామానికి చెందిన ఎడ్ల సన్యాసి నుంచి 300 లీటర్లు నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. సన్యాసిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రుషింగి గ్రామం నుంచి 50 కుటుంబాలు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆధ్వర్యంలో వైసిపి లోకి చేరాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్

ఎన్నికల్లో ఐక్యంగా పనిచేద్దాం : వైరిచర్ల

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి టి.జగదీశ్వరి గెలుపే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పని చేద్దామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్ర దేవ్ అన్నారు. సోమవారం కురుపాం కోటలో ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి ఆధ్వర్యంలో ఐదు మండలాల ఉమ్మడి పార్టీల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఎలా మార్చుకోవాలి, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అవగాహనపర్చి ఓటుగా మలిచే విధానం నియోజకవర్గ కేంద్రంలో టిడిపి కార్యాలయం ఏర్పాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి నాయకుడు. కార్యకర్త సైనికుడిలా పనిచేసే గెలుపుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేశ్వరరావు, మండల కన్వీనర్లు కెవి కొండయ్య, అక్కేన మధుసూదనరావు, శేఖర్ పాత్రుడు, టిడిపి తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలో టిడిపి ఎన్నికల ప్రచారం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని జర్న పంచాయతీ చోరుపల్లిలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సెంబు ఆధ్వర్యంలో 60కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామానికి ప్రధానంగా ఉన్న రోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా జర్న, జర్న వలస, ఉరిటి గ్రామాల్లో బాబు షూరిటి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త కద్రక మల్లేష్, మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, క్లస్టర్ ఇంచార్జి కె.దాసు, కురుపాం నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎ.నరేష్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటి భారతి, కొమరాడ మండల ఎస్టీ సెల్ కార్యదర్శి కె బలరాం, గుమ్మలక్ష్మీపురం మండల ఎస్సీ సెల్ కార్యదర్శి బి.రమేష్ తదితరులు ఉన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి -బలిజిపేట

ఎన్నికల షెడ్యూలు విడుదలైన దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌ను అమలు చేయాలని మండల 31వ సెక్టార్ ఆఫీసర్ సామల సింహాచలం అన్నారు. సోమవారం 31వ సెక్టార్ పరిధిలోని పెదపెంకిలో గల ఏడు పోలింగ్ కేంద్రాలను బిఎల్‌ఒలతో కలిసి పరిశీలించారు. గ్రామమంతా కలియతిరిగి ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ పార్టీల పోస్టర్లు, జెండాలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. అనంతరం బిఎల్‌ఒలతో సమావేశమై మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు రామారావు, తిరుపతిరావు, అశోక్, చంటి తదితరులు పాల్గొన్నారు.

కదిలిన అధికారి యంత్రాంగం

వీరఘట్టం : సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సోమవారం అధికారి యంత్రాంగం వీరఘట్టంలో పర్యటించింది. అన్ని వీధుల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, స్టిక్కర్లు, బ్యానర్లను తొలగించారు. అలాగే స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలోని ఎంపిడిఒ ఛాంబర్‌లో గల సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటం తొలగించారు.


గోడలపై ఉన్న స్టిక్కర్లను తొలగిస్తున్న సిబ్బంది